కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 10–12, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు ఉచిత వినికిడి పరీక్షలు

సనత్‌నగర్: అన్ని వయస్సుల వారికి సోమవారం ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఏషియన్ ఈఎన్‌టీ హాస్పిటల్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ చావా ఆంజనేయులు తెలిపారు. బేగంపేట పుల్లారెడ్డి స్వీట్స్ బిల్డింగ్‌లో ఆదివారం జరిగే ఉచిత వినికిడి శిబిరంలో ఆడియో మెట్రి, బెరా టెస్ట్, హియరింగ్ టెస్ట్, క్లాకియర్ ఇంప్లాంట్ వంటి అన్ని రకాల పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పారామెడికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రాంగోపాల్‌పేట్: కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్యారా మెడికల్ కళాశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు అందిస్తున్నామని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటలో తెలిపారు. ఈ నెల 27 లోపు పాత కిమ్స్–సన్షైన్ ఆస్పత్రి ప్రాంగణంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. వివరాలకు 7093589568 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

పరీక్ష ఫీజు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీజీ సెమిస్టర్ పరీక్షల ఫీజులు తగ్గించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.శశికాంత్‌కు ఫీజులు తగ్గించాలని, ఫీజు చెల్లించే గడువును పెంచాలని వినతి పత్రం సమర్పించారు. ఓయూలో వివిధ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజుల పెంపుపై వీసీ ప్రొ.కుమార్ సమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు ధృహన్, కార్యదర్శి శివశంకర్‌తో పాటు హరిప్రసాద్, భాస్కర్, జశ్వంత్, అన్వేష్, రాజేష్, శ్రీకర్, హరీష్, శివ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దినేష్ కుటుంబసభ్యులకు పరామర్శ



దినేష్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కోట నీలిమ

సనత్‌నగర్: కొండపోచమ్మ రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి మృతి చెందిన బన్సీలాల్‌పేట డివిజన్ సీసీనగర్‌కు చెందిన విద్యార్థి దినేష్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ పరామర్శించారు. శనివారం సీసీనగర్‌లోని వారి నివాసానికి వెళ్లి దినేష్ మృతికి ఆమె సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు

ఓలా, ఉబర్‌తో ఆటోడ్రైవర్లకు ఇబ్బందులు



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

లాలాపేట: ఆటో డ్రైవర్ల ఉపాధిపై గండికొడుతున్న ఓలా, ఉబర్ బైక్‌లను సిటీలో పూర్తిగా నిషేధించాలని ఏఐటీయుసి ఆటో యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యాదర్శి బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఆటో డ్రైవర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓలా, ఉబర్ వల్ల ఆటో డ్రైవర్ల జీవనం రోజు రోజుకూ దుర్భరంగా మారిందన్నారు. ఈ విషయమై త్వరలో రవాణా శాఖా మంత్రి, సీఎంను కలిసి విన్నవిస్తామన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

వెంగళరావునగర్: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఈనెల 22వ తేదీ రాత్రి మధురానగర్ పోలీసులు కృష్ణకాంత్‌పార్క్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్దకు పోలీసులు వెళ్లగానే పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం ఆ యువకులను విచారించగా సతీష్, రవి, మహేష్, రంజిత్‌లుగా తెలియజేశారు. వారి వద్ద 20 గ్రాముల గంజాయి, ల్యాప్‌టాప్, వెయింగ్ మిషన్, ప్రింటర్‌లు ఉన్నాయి. ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న పాకెట్లలో కావాల్సిన వారికి విక్రయిస్తామని యువకులు పోలీసులకు తెలిపారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని, యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

సిగ్నల్స్ పనిచేస్తే ట్రాఫిక్‌జామ్ | **నాలుగేళ్లుగా ట్రాఫిక్ లైట్స్ ఆఫ్** | **చిలకలగూడ కూడలిలో విచిత్ర పరిస్థితి**

చిలకలగూడ సర్కిల్‌లో వాహనచోదకులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఆన్ చేస్తే ఒక బాధ.. ఆఫ్ చేస్తే ఒక బాధ.. విచిత్రమేమంటే సిగ్నల్స్ ఆన్ చేస్తే చౌరస్తా నలువైపులా వాహనాలు కిలోమీటర్ల కొద్దీ ఆగిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్స్ ఆన్‌చేయడాన్నే మానేశారు.



చిలకలగూడ కూడలిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లు

సికింద్రాబాద్: ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయడం సహజం..ఏర్పాటు చేయాలి కూడా.. అప్పుడే రోడ్లపై జామ్ సమస్యకు పరిష్కారమవుతుంది. ప్రపంచంలో ఎక్కడైనా ఇవే నిబంధనలుంటాయి. అయితే చిలకలగూడ చౌరస్తాలో మాత్రం ఇందుకు విరుద్ధం.. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఆన్ చేస్తే చాలు వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోతాయి. దీంతో సమస్య రెట్టింపవుతుంది. ఎక్కడా లేని సమస్య చిలకలగూడలో మాత్రం విరుద్ధంగా ఉంది.

ఇక్కడంతా విరుద్ధం

సికింద్రాబాద్ ఒలిఫెంటా రైల్వే వంతెన సమీపంలోని చిలకలగూడ కూడలిలో ఏర్పాటు చేసిన (ఫైవ్ హ్యాండ్స్) ఐదు మార్గాల్లో అధునాతన ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నళ్లను ఆన్ చేస్తేచాలు వాహనాల రద్దీ పెరుగుతుంది. సిగ్నల్ లైట్లు అలా ఆన్ అయిన పావుగంటలోనే కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో ఎదురవుతున్న గందరగోళ పరిస్థితులు చక్కదిద్దడం పోలీసులకు తలకుమించిన భారంగా మారుతోంది. ఎందుకొచ్చిన తలనొప్పిగా భావిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఇక్కడి సిగ్నళ్లను ఆన్ చేయడం మొత్తంగా మానేశారు. దీంతో ఇక్కడి అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అక్కడ నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉంటుంది.

అధునాతన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు

మెట్రో కారిడార్ల నిర్మాణం సమయంలో సికింద్రాబాద్ రైల్వే రిజర్వేషన్ (ఒలిఫెంటా వంతెన) సమీపంలోని చిలకలగూడ చౌరస్తాను భారీగా విస్తరించారు. ఇక్కడి విశాలమైన కూడలిలో 2020 అక్టోబర్‌లో అధునాతన ట్రాఫిక్ సిగ్నల్ వ్యస్థను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన ఆరు నెలల అనంతరం లాంఛనంగా ప్రారంభించారు. ఈ మీదట సిగ్నల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో జీబ్రా లైన్లు, పాదచారుల కోసం ప్రత్యేక లైన్లు వేయించేందుకు సన్నాహాలు చేశారు. తీరా ప్రయోగాత్మక పరీక్షల్లో ఫలితాలు బెడిసికొట్టాయి.

ట్రయల్‌రన్‌లో గందరగోళం

ట్రాఫిక్ డీసీపీ (ఈస్ట్‌జోన్) అశోక్‌కుమార్ నేతత్వంలో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు మరోమారు ఇక్కడి ట్రాఫిక్ సిగ్నళ్లు ఆన్‌చేసి ట్రయల్‌రన్ నిర్వహించారు. మళ్లీ గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో ఆఫ్ చేయక తప్పలేదు. ఇదిలా ఉంటే ఇక్కడ పాదచారులు రోడ్డు దాటాలంటే అష్టకష్టాలు పడాలి. పిల్లలు, వద్ధులతో వచ్చేవారికి ట్రాఫిక్ పోలీసులు సహకరిస్తే తప్ప రోడ్డు దాటుకుని వెళ్లే పరిస్థితులు లేవు.

అసలు సమస్య ఏమంటే..

తార్నాక, జామై ఉస్మానియా, ముషీరాబాద్, రైల్వేస్టేషన్ బోయిగూడ (10వ ప్లాట్‌ఫామ్), రైల్వేస్టేషన్ మార్గాలకు దారులు ఈ కూడలో ఉన్నాయి. దీంతో ఇక్కడ ఐదు మార్గాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఆన్‌చేస్తే (2 నిమిషాల పాటు) ఐదు మార్గాల సిగ్నల్స్ పూర్తి కావాలంటే పది నిమిషాల సమయం తీసుకుంటుంది.ఈ పది నిమిషాల వ్యవధిలో చుట్టూ అన్ని మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల కొద్దీ ఆగిపోతాయి. అలా ఓ అరగంటపాటు సిగ్నల్స్ ఆన్‌చేస్తే రోడ్లు మొత్తం జామ్ అవుతాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు చేతులెత్తేశారు. సమస్య పరిష్కారానికి ఓ కానిస్టేబుల్ అక్కడ వాహనాలను నియంత్రిస్తాడు. అప్పుడప్పుడూ ఆ కానిస్టేబల్ కూడా ఉండడు. ఆ సమసయంలో వెళ్లాలంటే పద్మవ్యూహం చేధించినట్లే... పద్మారావునగర్, అమర్‌టాకీస్ చౌరస్తా, ఆలుగడ్డబావి, రేతీఫైల్ కూడలి వరకు వాహనాలు బారులుతీరి గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి.

రోడ్ల విస్తరణే సమస్యకు పరిష్కారం



పలుమార్లు ప్రయత్నించినా సిగ్నళ్ల కొనసాగింపుతో ఇబ్బందులే ఎక్కువగా ఉంటున్నాయి. బోయిగూడ రైల్వేస్టేషన్ దారి మినహా మిగతా నాలుగు మార్గాల్లోని రైల్వేస్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి కొంతమేర రైల్వే స్థలాన్ని సేకరించి రహదారులు విస్తరించినప్పుడు తప్ప సిగ్నళ్లు ఆన్ చేయం సాధ్యం కాదు. విస్తరణతో వాహనాల అవుట్‌పుట్ సులభతరం అవుతుంది. పాదచారులకు రక్షణ లభిస్తుంది.

– సీహెచ్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అంబేడ్కర్ ఆశయసాధనకు పాటుపడదాం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న వెల్లాల రామ్మోహన్



రసూల్‌పురా కంగాల్ చౌరస్తాలో ..

సనత్‌నగర్: సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు ప్రతిభ కనబర్చిన మరో ఎనిమిదికి బహుమతులను ఆయన అందజేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలన్నారు బీజేపీ మహంకాళి జిల్లా ఎకనామిక్ సెల్ కన్వీనర్ వెంకట సుబ్బారావు, సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు చైతన్యకుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రసూల్‌పురా: బీజేపీ సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ కంటోన్మెంట్ రెండో వార్డు అధ్యక్షుడు మందుల శ్రవణ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. శనివారం రసూల్‌పురా కంగాల్ చౌరస్తాలో ఈ కార్యక్రమం జరిగింది.

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు: తలసాని

రాంగోపాల్‌పేట్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు జాప్యాన్ని నివారించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన రాంగోపాల్ పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో లైబ్రరీ భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, జలమండలి జీఎం వినోద్, ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సమస్యలు పరిష్కరించాలి

లాలాపేట: వినాయక్‌నగర్ ఈస్ట్ కాకతీయ నగర్ కమిటీ సభ్యులు శనివారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమ్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో టీటీయూసీరాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, కాకతీయ నగర్ కమిటీ సభ్యులున్నారు.



డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఈస్ట్ కాకతీయ నగర్ వాసులు

మహిళా సాధికారతకు తోడ్పాటునందిస్తాం

బంజారాహిల్స్: మహిళా సాధికారతకు మహిళా కమిషన్ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని తెలంగాణ ప్రభుత్వ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ (వీబీఎస్)కు చెందిన వీబీఎస్ జెడ్ చాప్టర్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో 'ఉమెన్ మెగా కాన్క్లేవ్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విభిన్న వృత్తి నేపథ్యాల నుంచి 100 మందికి పైగా మహిళలు ఒకచోట చేరి వ్యాపార రంగంలో మహిళల పరస్పర సహకారం, మహిళా సాధికారతను పెంపొందించడానికి కావలసిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి నేరెళ్ల శారద హాజరై మాట్లాడుతూ మహిళలకు మద్దతు ఇవ్వడంలో మహిళా కమిషన్ ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందన్నారు.

వీబీఎస్ వ్యవస్థాపకుడు ఎమ్మడి శివకుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన వీబీఎస్ నగరంలో ఐదు చాప్టర్‌లు కలిగి ఉందన్నారు. వీబీఎస్ జెడ్ చాప్టర్ అధ్యక్షుడు శంకర్ మొగుడంపల్లి మాట్లాడుతూ మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి తాము మహిళా మెగా కాన్క్లేవ్‌ను నిర్వహించామన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

రసూల్‌పురా: బోయిన్‌పల్లి తారా హోమ్‌లో కూకట్‌పల్లి యువజ్యోతి, సేయింట్ అల్ఫోన్సా కెథడ్రల్ చర్చ్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రముఖ గాయకుడు అర్జున్ విజయ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో లక్ష్మి, సీఎస్ఆర్ మేనేజర్ శివ, మార్కెటింగ్ మేనేజర్ సయ్యద్ షబ్బీర్ అలీ, రెవరెండ్ ఫాథర్ అంటోని తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణలో ఆలస్యం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో ఆలస్యం తగదని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షులు తాళ్ల అజయ్ ఆధ్వర్యంలో 57 ఎస్సీ కులాల–మేథోమథనం కార్యక్రమం జరిగింది. ప్రొ.గజవెల్లి ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా చింతల రాజలింగం, నాలుగ శ్రీనివాస్‌యాదవ్, డా.రాజమౌళి తదితరులు ప్రసంగించారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జాప్యం చేసినట్లే మళ్లీ స్సీ వర్గీకరణ విషయంలో చేస్తోందన్నారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఔటా ఎన్నికలు నిర్వహించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ఎన్నికలు నిర్వహించాలని అధ్యాపకులు వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు. ఔటా కార్యవర్గం గడువు ముగిసి మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఎన్నికలు నిర్వహణ పై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఇకనైన ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

లాలాపేట: ఎరుకల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శనివారం సంఘం నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో దాదాపు 8 లక్షల జనాభా కల్గిన ఎరుకల సామాజిక వర్గం విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక రాజకీయాల్లో వెనుకబడి ఉన్నారని మంత్రికి వివరించారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. కుతాడి రవికుమార్, వనం రమేష్, నరసింహా, యాదగిరి, శ్రీరాములు,ఎల్లయ్య, రాజశేకర్, సదానంద్, రమేష్, సురేష్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మందులు స్వాధీనం



నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్న యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ అధికారులు

అడ్డగుట్ట: డ్రగ్స్ కంట్రోల్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి అడ్డగుట్టలోని ఓ గోదాంపై దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 2.20 లక్షల విలువైన మందులను స్వాదీనం చేసుకున్నారు. అడ్డగుట్ట తుకారాంగేట్‌లోని సిద్ది శ్రీధర్ నివాసంలో మందులను నిలువ ఉంచి అమ్ముతున్నట్లు గుర్తించినట్లు సికింద్రాబాద్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తెలిపారు. అంతేకాకుండా అయుర్వేద మందులని దేవ టోన్ సిరప్‌తో కీడ్నిలోని రాళ్లు కరిగిపోతాయని, శతపుష్ప పండు పొడి, కోర్ది పోలియో మాత్రలు వాడితే జ్వరం తగ్గిపోతుందని అవాస్తవాలు ప్రచారం చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. మందులను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఓటరు దినోత్సవం



బౌద్ధనగర్‌లో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



రెజిమెంటల్ బజార్‌లో విద్యార్థుల ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యాగనర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాతీయ ఓటరు దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు అధ్యక్షత వహించగా రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జర్నలిజం అధ్యాపకులు డాక్టర్ కృష్ణకుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ వెంకట్ ఈశ్వర్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఓటు హక్కు వినియోగించుకుంటాం'

బౌద్ధనగర్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం వారాసీగూడలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు మేకల హర్ష కిరణ్, బస్తీ అధ్యక్షులు ఓములు ఆధ్వర్యంలో బస్తీ ప్రజలకు ఓటు హక్కు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు జయశ్రీ, సంగీత, వార్డు మెంబర్లు భాగ్య, వాణి, భువనేశ్వరి తదితరులు బస్తీ ప్రజలతో ఓటు హక్కు తప్పక వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.

ఓటర్స్‌డే సందర్భంగా ర్యాలీ

రాంగోపాల్‌పేట్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెజిమెంటల్ బజార్‌లోని సెయింట్ మేరీస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో రెజిమెంటల్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఓటు ప్రాధాన్యత తెలియచేస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.

టీ-20 చాంపియన్ హైదరాబాద్ జట్టు

అంబర్‌పేట: రాజీవ్‌గాంధీ మెమోరియాల్ అండర్–19 క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు నిలిచింది. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్‌లో తమిళనాడు, హైదరబాద్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసి ఓటమి పాలైంది. అనంతరం శనివారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి.హనుమంతరావు, భారత మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బహుమతి అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంబుల శ్రీకాంత్‌గౌడ్, ప్రతినిధులు ఆది అవినాష్ పాల్గొన్నారు.

డబ్బు కోసం కిడ్నాప్.. హత్య

ప్రధాన నిందితుడి అరెస్ట్

రసూల్‌పురా: పాన్‌మసాలా వ్యాపారిని డబ్బు కోసం కిడ్నాప్ చేసి అనంతరం హత్య చేసిన ప్రధాన నిందితుడు సయ్యద్ సజ్జాద్ అహ్మద్ ఖాన్ (45)ను కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. తిరుమలగిరి ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన మేరకు.. కార్ఖాన విక్రంపురి ప్రాంతానికి చెందిన పాన్‌మసాలా వ్యాపారి బొల్లు రమేష్ ఈ నెల 18న అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి చంద్రాయణ గుట్ట బండ్లగూడ కీస్ ఆవెన్యూ కాలనీకి చెందిన సయ్యద్ సజ్జాద్ అహ్మద్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. హయత్‌నగర్ వాసులు ఓబైద్ మీర్జా, పర్వేజ్‌లతో కలసి పాన్‌మసాల కొనుగోలు కోసం రమేష్‌ను సంప్రదించారని, బండ్లగూడలోని గోదాంకు తీసుకెళ్లి రూ. 6 లక్షల పాన్‌మసాల మెటీరియల్, రూ.15 లక్షల నగదు తీసుకుని కిడ్నాప్ చేశామన్నారు. కారులో ఖమ్మం కుసుమంచి కోక్యా తాండా వద్దకు చేరుకున్న అనంతరం కారు ఆపి తాడుతో కాళ్ళు చేతులు కట్టి టవల్‌తో గొంతు కోసి ముఖంపై రాళ్ళతో మోది హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడన్నారు. ఇదిలా ఉండగా కార్ఖాన పోలీసులు కుసుమంచి చేరుకుని మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో స్థానిక పోలీసులు, ఓ స్వచ్ఛందసంస్థ సహకారంతో అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

యూపీహెచ్‌సీలో కేంద్ర వైద్య బృందం తనిఖీ

ముషీరాబాద్: భోలక్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ కేంద్ర వైద్య బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అందిస్తున్న సేవలు, మందులు వివరాలు, ప్రతిరోజు వస్తున్న రోగుల సంఖ్య, సాధారణ ప్రసవాలు తదితర వివరాలను కేంద్ర వైద్య బృందం డాక్టర్లు కవిత, మాళవికత యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై కేంద్ర వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. ఆసుపత్రి పీహెచ్‌ఎన్‌లు కమలమ్మ పాల్గొన్నారు.